'గాయత్రి' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుల డిమాండ్

కామారెడ్డి, జూలై 26 : చెరుకు రైతులను మోసం చేసిన గాయత్రి షుగర్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. రైతుల ప్రమేయం లేకుండా కోట్ల రూపాయల రుణాలు తీసుకొని మోసం చేసిందని ఆరోపించారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు..షుగర్ ఫ్యాక్టరీలో సభ్యత్వం ఉన్న రైతుల నుంచి పాసుపుస్తకాలను యాజమాన్యం తీసుకొని రైతుల పేరిట బ్యాంకులో రుణాలు తీసుకున్నదని తెలిపారు. రైతులను మోసం చేసిన బ్యాంకు అధికారులు, షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ప్రకాశ్, కిశోర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

నిధుల విడుదలపై కాలయాపన

కామారెడ్డి, జూలై 26 : రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ నిధుల విడుదలపై కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాలయాపన చేస్తే త్వరలో జరగనున్న పంచాయతీ, జడ్పీ, మున్సిపల్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కూర శ్రీనివాస్, అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ గరిపల్లి శ్రీధర్, మోత్కూరి శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి

బాన్సువాడ, జూలై 26 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆర్డీవో కార్యాలయంలో డీఏవో సువర్ణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు వెళ్తే డబ్బులు చెల్లిస్తేనే ఇస్తామని యాజమాన్యాలు వేధిస్తున్నాయని అన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు రాఘవ, రాజు, విష్ణు, సాయి తదితరులు ఉన్నారు.

దళితుల భూములకు పంట రుణాలు ఇవ్వాలి

భిక్కనూరు, జూలై 26: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దళితులకు ఇచ్చిన భూములపై పంట రుణాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పోట్టిగిని శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇచ్చిన భూములపై క్రాప్ లోన్లు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దళితుల ఓటు బ్యాంకుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ క్రాప్ లోన్లు ఇవ్వకపోవడం దళితులను మోసం చేసినట్లే అన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగభుషణం, నాయకులు కరుల నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీ ప్రకటించిన ఫలితాల్లో ఆర్‌కే కళాశాలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను టీయూ ప్రొఫెసర్ ఆరతి శుక్రవారం అభినందించి సన్మానించారు. జ్ఞాపిక, పతకాలను బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో జైపాల్ రెడ్డి, టీయూ అధ్యాపకురాలు ప్రసన్న, ప్రిన్సిపాల్ సైదయ్య, నవీన్ కుమార్, గోవర్ధన్, గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

–కామారెడ్డి, జూలై 26

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బీబీపేట్/ రామారెడ్డి/ కామారెడ్డి/దోమకొండ/ భిక్కనూర్, జూలై 26: జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంతోపాటు రామారెడ్డి, దోమకొండ, భిక్కనూర్, బీబీపేట్ మండలాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. సీఎంఆర్ఎఫ్ కోసం క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే

మండలంలో ఆర్డీవో విస్తృత పర్యటన

మొగులన్‌పల్లి తండాలో మొక్కలు నాటుతున్న ఆర్డీవో రాథోడ్ రమేశ్

బాన్సువాడ, జూలై 26 : మండలంలోని తాడ్కోల్, మొగులన్ పల్లి తండా, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం ఆర్డీవో రాథోడ్ రమేశ్ పర్యటించారు. తాడ్కోల్ గ్రామ పంచాయతీని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో మురికి కాలువలను పరిశీలించారు. అనంతరం మొగులన్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం తిర్మలాపూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ రెడ్డి, ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో సిబ్బందిని నియమించండి

దోమకొండ, జూలై 26: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయించాలని మాజీ జడ్పీటీసీ తిర్మల్ గౌడ్.. జిల్లా వైద్యాధికారిణి విజయలక్ష్మి, మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ రామ్‌సింగ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట దోమకొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం మధు తదితరులు ఉన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

దోమకొండ, జూలై 26: మండల కేంద్రంలోని శ్రీ చాముండేశ్వరి ఆలయ సమీపంలో శుక్రవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు కీర్తన ఆధ్వర్యంలో వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్ గౌడ్, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమకొండ ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

దోమకొండ, జూలై 26: మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన సేవలు సకాలంలో అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

లింగంపేట, జూలై 26: మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో నరేశ్ శుక్రవారం తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. శెట్పల్లి గ్రామంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించి కార్యదర్శికి పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ తెలిపారు.

ఘనంగా ఊరడమ్మ పండుగ

కామారెడ్డి, జూలై 26 : జిల్లా కేంద్రంలోని వీక్లి మార్కెట్‌లో ఉన్న దుర్గమ్మ ఆలయంలో సదర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఊరడమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని, రైతులు,ప్రజలు సుఖః సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సదర్ సంఘ సభ్యులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైలారంలో కొచ్చెర మైసమ్మ పండుగ

నస్రుల్లాబాద్, జూలై 26: మండలంలోని మైలారం శివారులోని గ్రామ దేవత కొచ్చెర మైసమ్మ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మైసమ్మ ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. అర్చనలు, అభిషేకాలు చేసి, భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో వన భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

ఊరడమ్మ పండుగలో పాల్గొన్న గ్రామస్తులు

మైసమ్మ ఆలయంలో భక్తుల పూజలు

కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి, జూలై 26 : జాతీయ ఆరోగ్య మిషన్ కింద బాన్సువాడలోని బస్తీ దవాఖానలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఏడాది పాటు మెడికల్ ఆఫీసర్‌గా పనిచేయడానికి అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుతోపాటు ఎం సీఐ రిజిస్ట్రేషన్, ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు, మార్క్స్ మెమోలు, నాలుగు నుంచి పదో తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు జతచేసి ఈనెల 30లోపు కామారెడ్డి కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితి, ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

కామారెడ్డి, జూలై 26 : తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రెసిడెన్షియల్, యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(ప్రిలిమ్స్, మెయిన్స్)కు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వందమంది (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీడబ్ల్యూడీ) అభ్యర్థులకు పది నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో www.tsstudy circle.com.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిక పరీక్ష ఆగస్టు 11వ తేదీన నిర్వహిస్తారని తెలిపారు.

కంశెట్‌పల్లిలో ఫ్రైడే డ్రైడే

నస్రుల్లాబాద్, జూలై 26: మండలంలోని కంశెట్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల్లో నిలిచిన నీటిని తొలగించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులను వివరించారు. పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా హన్మాండ్లు

నస్రుల్లాబాద్, జూలై 26: పీఆర్టీయూ నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడిగా హన్మాండ్లును ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శిగా శ్రీచంద్, సహ అధ్యక్షుడిగా సంజీవులు, మహిళా కార్యదర్శిగా సుజాత, కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రిని నియమించాలి

ఎల్లారెడ్డి రూరల్, జూలై 26: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వెంటనే కార్మిక శాఖ మంత్రిని నియమించాలని భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో కార్మికులకు నిధులు కేటాయించలేదని తెలిపారు.

బోనాలకు రావాలని డీఎస్పీకి ఆహ్వానం

ఎల్లారెడ్డి, జూలై 26: ఎల్లారెడ్డిలో ఆదివారం నిర్వహించనున్న బోనాల పండుగకు రావాలని కోరుతూ ఆలయ కమిటీ బాధ్యులు డీఎస్పీ శ్రీనివాసులకు శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు సీఐ రవీందర్, ఎస్సై మహేశ్‌ను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

కస్తూర్బా విద్యార్థినులకు వైద్య పరీక్షలు

విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యుడు

రామారెడ్డి, జూలై 26: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో వైద్య బృందం విద్యార్థినులను పరీక్షించింది. జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను సేకరించారు. అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ.. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వానకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. స్కూల్ ఆవరణలోని గుంతల్లో నీరు నిల్వ ఉంచకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. శిబిరంలో డాక్టర్ మానస, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

రక్తం సేకరిస్తున్న వైద్యసిబ్బంది

లింగంపేట, జూలై 26: లింగంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరం శుక్రవారం మూడో రోజు కొనసాగింది. వైద్య సిబ్బంది పలువురిని పరీక్షించి మందులు అందజేశారు. దోమల నివారణ కోసం పైరిత్రిన్ మందును పిచికారీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలను వైద్య సిబ్బంది సేకరిస్తున్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

గాంధారి, జూలై 26: వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. గాంధారిలోని ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ డివైడర్‌పై ఆయన శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మొక్కను నాటి నీరు పోశారు. మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అంతకు ముందు బస్టాండ్‌ను సందర్శించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనవెంట ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, కామారెడ్డి ఆర్టీసీ డీఎం భాగ్యలక్ష్మి, నాయబ్ తహసీల్దార్ రవి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, నాయకులు తూర్పు రాజు, బెజుగం సంతోష్, గడ శంకర్, లైని రమేశ్ తదితరులు ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి..

లింగంపేట, జూలై 26: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాజు సూచించారు. మండలంలోని పోల్కంపేట గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. గ్రామంలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం గ్రామ సభలో పాల్గొన్నారు. ఆయనవెంట ఎంపీవో మలహరి, పంచాయతీ కార్యదర్శి అశ్వక్ ఉన్నారు.

మహ్మద్‌నగర్‌లో యూనిఫామ్‌లను పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి విజయభాస్కర్

గాంధారిలో డివైడర్ మధ్యలో మొక్కను నాటుతున్న ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ..

నిజాంసాగర్, జూలై 26: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి విజయభాస్కర్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. వనమహోత్సవంలో భాగంగా శ్మశాన వాటికలో మొక్కలు నాటారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో అనిత, ఎంపీడీవో గంగాధర్, ఏపీవో శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎమ్ రాంనారాయణ గౌడ్, టీఏ బాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వానలతో నష్టపోతే వివరాలు అందజేయాలి

మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మణ్

నాగిరెడ్డిపేట, జూలై 26: మండలంలో వానలతో నష్టం జరిగితే బాధితుల వివరాలు సేకరించి అందజేయాలని తహసీల్దార్ లక్ష్మణ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని సూచించారు. పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీవో ప్రభాకర్‌చారి, సీనియర్ అసిస్టెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలి

లింబూర్‌లో పత్తిని పరిశీలిస్తున్న ఏఈవో నాందేవ్

డోంగ్లీ, జూలై 26: పత్తి పంట సాగుచేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏఈవో నాందేవ్ సూచించారు. మండలంలోని లింబూర్ శివారులో రైతులు సాగుచేస్తున్న పత్తిని ఆయన శుక్రవారం పరిశీలించారు. వానలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి చేనులో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. మొక్కల ఎదుగుదలకు బూస్టర్ డోస్ వినియోగించుకోవాలన్నారు. ఆయనవెంట పలువురు రైతులు ఉన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

గాంధారి, జులై 26: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించనున్నట్లు ఏఎస్సై గంగారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక హాజరవుతారని పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తారని, సదస్సుకు గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

30న చలో హైదరాబాద్

బిచ్కుంద, జూలై 26: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్‌గొండ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల తనిఖీ

నాగిరెడ్డిపేట, జూలై 26: మండలంలోని మాటూర్‌లో ప్రభుత్వ పాఠశాలను ఎంపీవో ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి రవీందర్ ఉన్నారు.

గోలిలింగాలలో పస్కజాతర

నాగిరెడ్డిపేట, జూలై 26: మండలంలోని గోలిలింగాల గ్రామస్తులు శుక్రవారం పస్క(పొలాల)జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల వద్ద వంట చేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే చెట్టుకు అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు.

దేవునిపల్లిలో బోనాల పండుగ..

ఎల్లారెడ్డి, జూలై 26: మండలంలోని దేవునిపల్లి గ్రామంలో శుక్రవారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసి అమ్మ వారికి సమర్పించారు. పండుగ సందర్భంగా గ్రామంలో సందడి నెలకొన్నది.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలి

లింగంపేట, జూలై 26: గ్రామంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి కచ్చితంగా నిర్మించుకోవాలని ఎంపీడీవో నరేశ్ అన్నారు. లింగంపేట పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్ ప్రత్యేక గ్రామ సభను శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని సభలో తీర్మానించారు.

ఇసుక డంప్‌లకు వేలం

బిచ్కుంద, జూలై 26: మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా తరలించి డంప్ చేసిన ఇసుకకు రెవెన్యూ అధికారులు శుక్రవారం వేలం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా తరలించిన 25 ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను తహసీల్దార్ సురేశ్ ఆధ్వర్యంలో గురువారం సీజ్ చేశారు. వాటికి శుక్రవారం వేలం నిర్వహించగా.. ప్రభుత్వానికి రూ.45,650 ఆదాయం చేకూరిందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

విద్యార్థులను చితక బాదిన అటెండర్

ఎల్లారెడ్డి, జూలై 26: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను అటెండర్ చితక బాదిన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాల మైదానంలో ఆడుకుంటున్నారు. అక్కడికి వచ్చిన అటెండర్ విఠల్ ఎనిమిది మంది విద్యార్థులను చితకబాదాడు. వారిలో ముగ్గురికి వాతలు వచ్చాయి. ఈ విషయమై హెచ్ఎం రాజేశ్వర శర్మను సంప్రదించగా.. ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★WANTED HOME TUITION TEACHER for 1st and 3rd Class Students in Nizamabad Town Contact No: 8793032690

NTZ-340199

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలి

ఎల్లారెడ్డి, జూలై 26: వానకాలంలో క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని ఆరోగ్య బోధకుడు దస్తీరాం సూచించారు. మండలంలోని కళ్యాణి గ్రామ జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుధారాణి, ఎంఎల్‌హెచ్‌పీ శివ, ఆశ కార్యకర్త సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎక్కపల్లిలో కూలిన గృహం

ఎక్కపల్లిలో కూలిన ఇల్లు

లింగంపేట, జూలై 26: మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన దూషన్నగారి బాలయ్య ఇల్లు వర్షాలకు కూలిపోయిందని పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇల్లు శుక్రవారం కూలిందన్నారు. విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేశామని తెలిపారు.

మద్యం దుకాణాల తనిఖీ

స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న ఎస్సై నగేశ్

మద్నూర్, జూలై 26: మండలకేంద్రంలోని పలు మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని రిజిష్టర్లను ఎస్సై నగేశ్ పరిశీలించారు. అధిక ధరలకు మద్యం విక్రయించొద్దన్నారు. 21ఏండ్లలోపు వారికి, విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోజు వారీగా స్టాక్ వివరాలను తమకు అందజేయాలని సూచించారు. ఆయనవెంట హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, సిబ్బంది శ్రీధర్, అనిత, దేవీసింగ్ ఉన్నారు.

పెద్ద చెరువు నీటిని కామారెడ్డికి తరలించొద్దు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రామారెడ్డి, జూలై 26: సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు నీటిని కామారెడ్డి పట్టణ ప్రజల తాగునీటి కోసం తరలించొద్దని సదాశివనగర్, రామారెడ్డి మండలాల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పెద్దచెరువు నీటినికామారెడ్డికి తరలించాలని బల్దియా సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పెద్దచెరువు ద్వారా తొమ్మిది గ్రామాలకు సాగునీరు అందుతున్నదన్నారు. రైతుల పొట్ట గొట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు. లేదంటే రైతుల ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సదాశివనగర్, రామారెడ్డి మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, రామారెడ్డి మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, నాయకులు లింబాద్రి నాయక్, ఎడ్ల నర్సింహులు, బీరయ్య, పోతుల లింగారెడ్డి, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.